క్లుప్తంగా

పామర్రులో ఇఫ్తార్ విందు

పామర్రు: రంజాన్ పవిత్ర మాసంలో ముస్లింలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా స్థానిక చిన్న మసీదులో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మస్జిద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కృష్ణా జిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు వల్లూరిపల్లి గణేష్, మండల అధ్యక్షులు కె.ప్రవీణ్‌చంద్ర, ముస్లిం మత పెద్దలు యూనుస్, మున్వర్, కరీముల్లా, అబ్బార్, ఆరీఫ్, షరీఫ్, పార్టీ నాయకులు ఎండీ ఇస్మాయిల్, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

తడి పొడి చెత్తపై ప్రజలకు అవగాహన

ఈదులమద్దాలి(పెదపారుపూడి): మండలంలోని ఈదులమద్దాలి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాసరావు పారిశుద్ధ్యంపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త గుర్తించి ఎలా వేరు చేయాలో వివరించారు. తడి, పొడి చెత్త ద్వారా వర్మీ కంపోస్టు ఎలా తయారు చేసుకోవచ్చో తెలిపారు. అనంతరం స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలకు విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మంటాడలో శిలువ యాత్ర



పమిడిముక్కల: ఈ అనుగ్రహ కాలం రక్షణకు సమయమని ఉయ్యూరు రోమన్ క్యాథలిక్ విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్ మద్దాలి వరప్రసాద్ అన్నారు. మండలంలోని మంటాడ అంబేడ్కర్ నగర్, ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ శిలువ మార్గం, దివ్య సత్ ప్రసాద ఆరాధన, దివ్య పూజాబలి నిర్వహించారు. ఉయ్యూరు విచారణ పరిధిలోగల 21 గ్రామాల క్రైస్తవ విశ్వాసులు, దీక్షాదారులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో అంబేడ్కర్ నగర్, ఇందిరమ్మ కాలనీ, రెడ్డిపాలెం పురవీధుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ శిలువ యాత్ర జరిపారు. ఫాదర్ అజయ్, ఉపదేసి గుదే సురేష్, సంఘ పెద్దలు టి.మరియమ్మ, గోశాల రాజు, నక్కా అంజమ్మ పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

పామర్రు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేశారు. పెదమద్దాలి శివారు గ్రామమైన కొత్త పెదమద్దాలి (కొత్తూరు) గ్రామానికి చెందిన కానోళ్ల శేషమ్మ (82) పామర్రు–దిగమర్రు జాతీయ రహదారికి అవతలవైపు ఉన్న వీరాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో పూజలు చేసి రోడ్డు దాటి వస్తుండగా అదే రహదారిపై పామర్రు నుంచి గుడివాడ వైపు వేగంగా వెళ్తున్న బైక్ శేషమ్మను ఢీకొట్టింది. కుటుంబసభ్యులు ఆమెను మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్య సేవలు పొందుతూ ఆమె మృతి చెందింది.

పగడాల ప్రవీణ్‌కు నివాళి

గుడివాడ టౌన్: క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ మృతి క్రైస్తవ సమాజానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ సభ్యులు అన్నారు. టిడ్కో కాలనీలో నిర్వహిస్తున్న క్రైస్తవ మహాసభల్లో పగడాల ప్రవీణ్‌కు బుధవారం నివాళులర్పించారు. పాస్టర్స్ జి. శ్యామ్‌బాబు, బి. సునీల్ కుమార్, జి. యెహెజ్కేలు, ఎలీషా, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదగొన్నూరులో పేకాటాడుతున్న ఏడుగురిని స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పంట పొలాల్లో పేకాటాడుతున్న వీరి నుంచి రూ.7500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ వ్యర్థాలతో సూక్ష్మజీవుల వృద్ధి

కైకలూరు: వేసవి కాలంలో వ్యవసాయ వ్యర్థాలతో మట్టిని కప్పి ఉంచడం వలన సూక్ష్మజీవులు, వానపాములు నేలలో వృద్ధి చెందుతాయని మండల వ్యవసాయాధికారిణి ఆర్. దివ్య చెప్పారు. వేమవరప్పాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వేసవిలో సూర్యరశ్మి నేలను తాకకుండా భూమిని కప్పి ఉంచితే నీరు ఆవిరి పోకుండా ఉంటుందని సూచించారు. పచ్చిరొట్ట పైరు వేయడం ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు బోయిన గోవర్ధన్, బోడావుల జగదీష్, నున్న వెంకటేశ్వరరావు, తేరా రమేష్, వసంతరావు, వీపీఏ గోపీనాథ్, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వైస్ ఎంపీపీ-1 రాజీనామా

కైకలూరు: వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలుపొంది వైస్ ఎంపీపీ-1గా ఉన్న మహమ్మద్ జహీర్ మచిలీపట్నం జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడికి రాజీనామా ప్రతాన్ని బుధవారం సమర్పించారు. వైస్ ఎంపీపీ-2గా ఉన్న తెంటు సత్యనారాయణ ఇటీవల మరణించారు. దీంతో వైస్ ఎంపీపీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడింది. గురువారం ఉదయం 11 గంటలకు కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జహీర్ రాజీనామా చర్చనీయాంశంగా మారింది.

ధరల మంటతో వంట చేసేదెలా సారూ ?

- ఆకాశానంటుతున్న నిత్యవసరాలు, కూరగాయల ధరలు
- 500 మందికి పైగా నియోజకవర్గంలో వంట ఏజెన్సీ వర్కర్లు
- ఏజెన్సీల వర్కర్లకు భారమైన మధ్యాహ్న భోజన తయారీ



గుడ్లవల్లేరు: నానాటికీ ఆకాశానంటుతున్న నిత్యవసరాలు, కూరగాయల ధరల మంటలతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేయాలంటే వంట ఏజెన్సీల వర్కర్లకు పెను భారంగా మారింది. గుడివాడ నియోజకవర్గంలో 500 మందికి పైబడి వంట ఏజెన్సీ వర్కర్లు పని చేస్తున్నారు. విద్యార్థి తల ఒక్కంటికి కుకింగ్ కాస్ట్ వచ్చేసరికి ఎంత పని చేసినా...తోక బెత్తిడే అన్న చందంగా ధరలు పెరగక ముందు ఉన్న రేట్లనే చెల్లించాలని ప్రభుత్వం చూస్తుంది. కానీ వాస్తవ రూపంలోకి వచ్చి ప్రస్తుత నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు మార్కెట్లో ఎలా ఉన్నాయో పరిశీలించి తమకు కుకింగ్ కాస్ట్‌ను కేటాయించాలని వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు. 2005 నుంచి అయితే 9-10వ తరగతి విద్యార్థులకు మాత్రం ఎలాంటి వేతనాలను ఇవ్వకుండానే 19 ఏళ్లగా వర్కర్లతో ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయి. గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో వంట ఏజెన్సీల వర్కర్లు మధ్యాహ్న భోజన తయారీలకు ఏర్పాటు చేసిన వంట షెడ్లను కూటమి ప్రభుత్వం నిధులు నిలిపివేసి మరుగున పడేసింది. దీనితో వర్కర్లు తమ వంటలను ఇరుకు షెడ్లలో, చెట్ల కింద చేసుకుంటున్నారు. తమ డిమాండ్లపై కూడా గళమెత్తుతున్నారు.

కుకింగ్ కాస్ట్ దయనీయం...

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేసేందుకు ప్రభుత్వం ఇచ్చే కుకింగ్ కాస్ట్ కూడా అందటం లేదు. 1-8వ తరగతి విద్యార్థులకు సెప్టెంబరు కుకింగ్ కాస్ట్ బిల్లులు రావలసి ఉంది. అక్టోబరులో అయితే 1-10వ తరగతి వరకూ కూడా బిల్లులు రాలేదు. పాత ధరలనే దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం కుకింగ్ కాస్ట్‌ను ఇవ్వటం అన్యాయమని బాధిత వర్కర్లు వాపోతున్నారు. భోజన తయారీకి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు తల ఒక్కంటికి రూ.8.57 అయితే...ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు రూ.5.88 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. కుకింగ్ కాస్ట్‌ను రూ.15 నుంచి రూ.20కు పెంపొందించాలని కోరుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మెనూకు అప్పటి సీఎం వై.ఎస్.జగన్ ఎప్పటికప్పుడు గౌరవ వేతనాలు, భోజన తయారీకి అయ్యే ఖర్చు చెల్లించేవారని చెబుతున్నారు. ఆ మెనూను బట్టి పాఠశాలలకు పిల్లలు వచ్చేందుకు ఆసక్తి చూపేవారని అంటున్నారు. ఇపుడు అదే మెనూను పెరిగిన ధరలకు నిర్వహించటం కష్టతరంగా మారుతుందని చెబుతున్నారు. పెరిగిన ధరలపై ఆ మెనూని ఇవ్వలేమని చెప్పేస్తున్నారు.



వంట చేస్తున్న నిర్వాహకురాలు

బడ్జెట్‌లో నిధులు పెంచాలి...

డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ తరఫున కోరుతున్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ ఛార్జీలను రూ.20కు పెంచాలని అంటున్నారు. కార్మికుల వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, 9, 10 తరగతులకు వండి పెడుతున్న వర్కర్లకు వేతనాలు, యూనిఫాం ఇవ్వాలని కోరారు. ప్రైవేటు సంస్థలకు అప్పగించిన భోజన పథకాన్ని రద్దు చేసి కార్మికులకు అప్పగించాలని కోరుతున్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని అంటున్నారు. ఉపాధి భద్రత కల్పించాలని కోరుతున్నారు. ప్రమాద బీమా కల్పించాలని అడుగుతున్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన

న్యాయమూర్తి గాయత్రి

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉంటే మంచి భవిష్యత్ ఉండటంతో పాటు సమాజానికి మేలు చేకూరుతుందని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పి. గాయత్రి అన్నారు. రాజేంద్రనగర్‌లోని జీఆర్‌కే ప్రభుత్వ హైస్కూల్లో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రత్యేకించి బాలికల మీద లైంగిక వేధింపులు పెరుగుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాటిని ఎదుర్కొనేందుకు మానసిక స్థైర్యం అవసరం అన్నారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే ఆ ధైర్యం వస్తుందని పేర్కొన్నారు. బాలికలను లొంగతీసేందుకు ఫోన్ చాటింగ్, గిఫ్ట్‌లు, పొగడ్తలు వంటివి ఉంటాయని తెలిపారు. వాటికి లొంగి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యతో పాటు సమాజం, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి గాయత్రి

రూ.86 కోట్లతో డీపీఆర్ సిద్ధం

ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడరూరల్: గుడివాడలో పేద వర్గాల నివాసిత ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.86 కోట్ల వ్యయంతో డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే రాము బుధవారం సమావేశం నిర్వహించారు. రూ.22.50 కోట్లతో తాగునీటి పైపులైన్లు, నూతన ట్యాంకుల నిర్మాణాలకు, రూ.10.90 కోట్లతో కనీస వసతుల కల్పన, రూ.52.74 కోట్లతో పెద్దవీధి, కొత్తపేట, ముబారక్ సెంటర్, బైపాస్‌రోడ్డు, గుడ్‌మన్‌పేట తదితర 13 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, మురుగు నీటి శుద్ధి ట్యాంక్ నిర్మాణానికి పైలెట్ ప్రాజెక్టుగా రూపొందించిన అంచనాల ప్రతిపాదనల గురించి అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుడివాడ రూపురేఖలు మార్చేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అధికారులు రూపొందించిన అంచనాల నిధులు సాధించేందుకు మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ, సంబంధిత శాఖల ఉన్నతాధికారులను కలుస్తానని చెప్పారు. సీఎం చంద్రబాబు సహకారం, ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలసి అమృత 2.0 నుంచి నిధులు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఈఈ స్వామినాయుడు, డీఈ పాండురంగ, మున్సిపల్ ఎంఈ ఎస్ఎస్ ప్రసాద్, సీవీ ఎస్‌టీ కన్సల్టెన్సీ డైరెక్టర్ శాస్త్రి, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

జీవన్‌జ్యోతి పథకం చెక్ పంపిణీ

గుడివాడ టౌన్: అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన కొండంత అండగా ఉంటుందని గుడివాడ పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు గోకరకొండ బలరామ్ అన్నారు. వర్తక సంఘం ఆధ్వర్యంలో పోస్టల్ కార్యాలయం వద్ద పీఎంజేజేబీవై చెక్కు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం సభ్యురాలు పూడి బుజ్జి మృతి చెందడంతో ఆ కుటుంబ సంక్షేమానికి రూ. 2 లక్షల చెక్కును అందించామని చెప్పారు. స్వల్ప ప్రీమియం చెల్లించి ఈ పథకంలో చేరడం వలన ఆ కుటుంబానికి ఈ పథకం ఎంతగానో ప్రయోజనకరంగా మారిందన్నారు. కార్యక్రమంలో గుడివాడ పోస్టాఫీస్ సూపరింటెండెంట్ ఎం. శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకట్రావు, ఐపీఓ బి. విజయ్, ఐపీపీబీ మేనేజర్ గణేష్, వర్తక సంఘం నాయకులు పెద్ది కిషోర్, అప్పన్న, ఎస్. చిన్నా, పి. గోపి, వెంకటరమణ పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న అధికారులు, సంఘం నాయకులు

పరిశోధన విధానాలపై సదస్సు

గుడివాడ టౌన్: శాస్త్రీయ పరిశోధనలకు సాహిత్య సమీక్ష సముచితమైన రీతిలో ఉండాలని ఢిల్లీ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ కె. త్రివేణి కుమారి అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో పరిశోధన పద్ధతి, మేధో సంపత్తి హక్కులపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ పరిశోధన అనేది చాలా ముఖ్యమైన అంశం అన్నారు. పరిశోధన శాస్త్రీయంగా ఎలా చేయాలో దాని మెలకువలపై ముందుగా అవగాహన ఉండాలన్నారు. శోధించడం ఒక కళ అని దానికి ఈ మెలకువలు తోడైతే పరిశోధన దిగ్విజయంగా కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, ఎంబీఏ హెచ్‌ఓడి ఎంబి. సువర్చల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ త్రివేణి కుమారి

దీర్ఘకాలిక నొప్పులకు మాన్యువల్ థెరపీ

గుడివాడ టౌన్: ఆధునిక ఆర్థోపెడిక్ మాన్యువల్ థెరపీ ద్వారా దీర్ఘకాలిక నొప్పులను శాశ్వతంగా తొలగించవచ్చని విజయవాడకు చెందిన డాక్టర్ వి. ప్రేమ్‌కుమార్ అన్నారు. జీవీ పూర్ణచంద్రరావు ఫంక్షన్ హాలులో రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక నొప్పుల నివారణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీర్ఘకాలిక నొప్పులకు కారణాలు, బయోమెకానిజం చికిత్సా విధానాల గురించి ప్రేమ్‌కుమార్ వివరించారు. దీనికి సమర్ధవంతమైన చికిత్సా విధానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు టి.ఎస్. రాజశేఖర్, జి. కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్

జాబ్‌మేళాలో 64 మందికి ఉద్యోగాలు

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఆటపాక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత మాట్లాడుతూ పోర్ట్ మేనేజ్‌మెంట్ సర్వీస్, నవతా రోడ్డు ట్రాన్స్‌పోర్టు, ముత్తూట్ ఫైనాన్స్, నేషనల్, జాగృతి స్కూల్స్‌లలో ఉద్యోగాల నిమిత్తం ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. మొత్తం 155 మంది హాజరయ్యారని, వీరిలో 64 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉదయ ప్రకాష్, ఏపీఎస్ఎస్‌డీసీ కో-ఆర్డనేటర్లు పాల్ దివాకర్, ప్రసాద్, సునీల్, జేకేసీ పీవో రవికుమార్, ఆయా కంపెనీలు, స్కూల్స్ ప్రతినిధులు హాజరయ్యారు.



ఉద్యోగాలు పొందిన యువతతో ప్రిన్సిపాల్ శ్రీలత, తదితరులు

మండవల్లి: మండలంలో కార్పొరేషన్ లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 28వ తేదీ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ అధికారి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు అర్జీతో పాటుగా ఆధార్, రేషన్, కుల ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్ పుస్తకం ఒక అసలు, రెండు నకళ్లు తీసుకురావాలని తెలిపారు.

ఉద్యోగులు ఉత్సాహంగా పని చేయాలి

కైకలూరు: విధి నిర్వహణలో కలిగే ఒత్తిడిని జయించి రెవెన్యూ ఉద్యోగులు ఉత్సాహంతో పని చేయాలని కైకలూరు తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం తెలిపారు. కైకలూరు కార్యాలయంలో సిబ్బందికి ఉచిత ఫిజియోథెరపీ క్యాంపును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ పని ఒత్తిడి ఉన్నప్పటికీ ఆరోగ్యం విషయంలో సిబ్బంది అశ్రద్ధ వహించొద్దన్నారు. సులభ చిట్కాలతో ఒత్తిడిని జయించాలని కోరారు. నిజాం ఫిజియోథెరపీ ఇనిస్టిట్యూట్ నుంచి వచ్చిన ఫిజియోథెరపిస్టు చల్లా రమేష్ మాట్లాడుతూ ఇటీవల పెయిన్ కిల్లర్స్ వాడటం వలన సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయన్నారు. ఎక్కువగా సెల్‌ఫోన్లు వినియోగించడం వలన రేడియేషన్ ప్రభావానికి గురువుతున్నారన్నారు. ఏలూరు జిల్లాలో ఈ రోజుతో ఫిజియోథెరపీ అవగాహన సదస్సులు ముగిశాయన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



గుడివాడరూరల్: మండలంలోని మోటూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాన్ని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఇప్పటికే 144 సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. కేంద్రం వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగానే అన్ని చర్యలు చేపట్టామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పామర్రు: బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఆసరాగా ఉంటుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. స్థానిక కార్యాలయంలో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాలలో బాధితులు 64 మందికి రూ.25,73,297 చెక్కులు పంపిణీ చేశామని చెప్పారు. అనారోగ్యానికి గురై వైద్య ఖర్చులు లేని బాధితులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వారి అభ్యర్థనను స్వీకరించి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొసరాజు వెంకటేశ్వరరావు, వీరంకి మోహన్, వీరాంజనేయులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పామర్రు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని అనేక మంది తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్గత రహదారులు నిర్మించాలని, పింఛన్ల మంజూరు చేయాలని, వంతెన నిర్మించాలని దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కూటమి నేతల చిల్లర ఎత్తుగడలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కైకలూరు మండల వైస్ ఎంపీపీ-2 ఎన్నికలు రసవత్తరంగా మారాయి. కూటమి నేతలు వైఎస్సార్ సీపీ గుర్తుతో గెలిచిన ఎంపీటీసీలను ప్రలోభపెడుతున్నారు. వాస్తవానికి వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన మండల ప్రాదేశిక ఎన్నికల్లో కైకలూరు మండలంలో 22 ఎంపీటీసీ స్థానాలకు గాను ఒకటి మాత్రమే టీడీపీ గుర్తుపై గెలిచారు. మిగిలిన 22 స్థానాలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. వీరిలో కైకలూరు సెగ్మెంట్-5 ఎంపీటీసీ వైస్ ఎంపీపీ-2 తెంటు సత్యనారాయణ ఇటీవల మరణించారు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. ఏ విధంగానైనా వైస్ ఎంపీపీ పదవి దక్కించుకోవాలని కూటమి పార్టీ కొద్ది రోజులుగా వైఎస్సార్ సీపీకి చెందిన ఆరుగురు సభ్యులను కూటమి పార్టీలో చేర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీపీతో సహా ఎన్నికల ముందు, తర్వాత ముగ్గురు కూటమిలో చేరారు. ఒకే ఒక టీడీపీ ఎంపీటీసీని కలుపుకుని కూటమి ఎంపీటీసీలు ఇప్పుడు 10 మందిగా లెక్కతేలారు. వీరిలోనూ ఇద్దరు వ్యతిరేకంగా ఉన్నట్లు సమాచారం. వైఎస్సార్ సీపీలో 10 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో వైస్ ఎంపీపీ జహీర్ రాజీనామా చేశారు. ఇదిలా ఉంటే వైఎస్సార్ సీపీ కొట్టాడ ఎంపీటీసీ సిద్దాబత్తిన సువర్ణమ్మ ఇటీవల దుబాయ్‌కి వెళ్లింది. ఇప్పుడు ఆమె ఓటు కీలకం కావడంతో అక్కడ నుంచి కైకలూరు రప్పిస్తున్నారు. మండలంలో ఆటపాక-1 సెగ్మెంట్ నుంచి వైఎస్సార్‌సీపీ నుంచి పట్టపు బాలమ్మ గెలుపొందారు. గురువారం జరిగే ఎన్నికల్లో ఆమె ఓటు వేయాల్సి ఉంది. ఆమె తన చిన్న కుమారుడితో కలిసి బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో కూటమి నేతలు ఆమె పెద్ద కుమారుడు రాజారావుతో టౌన్ పోలీసు స్టేషన్‌లో దూలం వినయ్, కూనవరపు సతీష్ మరి కొంతమంది కలసి మా తల్లిని, తమ్ముడు యాకోబు రాజును కిడ్నాప్ చేశారని ఫిర్యాదు ఇచ్చాడు. బంధువుల ఇంటి వద్ద సురక్షితంగా ఉన్నామని, ఎవరూ కిడ్నాప్ చేయలేదని, కూటమి నేతల వల్ల నా కుమారుడు ఫిర్యాదు ఇచ్చాడని చెప్పింది.

మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కల్యాణోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వైభవంగా అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గూడూరు భవానీశంకర్ శాస్త్రి, స్వస్తి వాచకులు ద్వాదశి కామేశ్వరశర్మ, ద్వాదశి ఫణికుమార్ శర్మ, హరి వెంకటసుబ్రహ్మణ్యం రవిశర్మ ఘనంగా విఘ్నేశ్వర పూజ చేశారు. మల్లేశ్వరస్వామిని పెండ్లి కుమారునిగా, భ్రమరాంబ అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేశారు. సహస్రనామ అర్చనలు, నవగ్రహపూజా, కలశ స్థాపన, ధ్వజారోహణ, బలిపూజ చేశారు.



వధూవరులుగా అలంకరించిన స్వామి, అమ్మవార్లు

ఏప్రిల్ 4న మండల సమావేశం

తోట్లవల్లూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 4న నిర్వహిస్తామని ఎంపీడీఓ కేవీఎస్ రవికాంత్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

పమిడిముక్కల: వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా రాయితీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ పరికరాలకు 50 శాతం, బ్యాటరీ స్ప్రేయర్‌కు వెయ్యి రూపాయలు, పవర్ స్ప్రేయర్‌కు రూ.10 వేలు, నీటిని సరఫరా చేసే పీవీసీ పైపులు రూ.15 వేలు రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి, వ్యవసాయ సహాయకులకు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఈ వ్యవసాయ పరికరాలను సన్న, చిన్నకారు రైతులకు మాత్రమే ఇస్తామని చెప్పారు. రైతు గరిష్ఠంగా రెండు హెక్టార్లలోపు పొలం కలిగి ఉండాలని, 2022 నుంచి ఈ పంటలో పంట నమోదు చేసుకొని ఉండాలని పేర్కొన్నారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే రాయితీ వర్తిస్తుందని చెప్పారు.

వాహనాలపై పార్కింగ్ ఫీజు

గుడివాడ టౌన్: గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని వ్యాపార దుకాణాలు, షాపింగ్‌మాల్స్, సినిమా థియేటర్ల వద్ద సంబంధిత వినియోగదారులు కాకుండా ఇతర వాహనదారులు 30 నిమిషాల కంటే ఎక్కువ సమయం పార్కింగ్ చేస్తే రుసుము వసూలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు.

మంచినీటి తొట్టెల ఏర్పాటు అభినందనీయం



కైకలూరు: వేసవి దృష్ట్యా మూగ జీవాల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేస్తున్న మంచినీటి తొట్టెలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఈ కార్యక్రమం అభినందనీయమని పలువురు అన్నారు. కైకలూరు రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, సిబ్బంది కలిసి శుక్రవారం మూగజీవాల కోసం మంచినీటి తొట్టెలు ఏర్పాటు చేశారు. అదే విధంగా పక్షులకు గింజలు, నీరు పెట్టారు. తొట్టెల్లో నీటిని పశువులు తాగుతున్నాయి. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ సిబ్బందిని అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పెదమద్దాలి(పామర్రు): గ్రామానికి చెందిన కంచర్ల అంజిబాబు గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మనం-వనం ఫౌండేషన్ డైరెక్టర్ పెనుమాల శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 5వేలను ఆర్థిక సహాయంగా అందజేశారు. సభ్యులు నత్తా రవి, తదితరులు పాల్గొన్నారు.